ప్రజాశక్తి

మంగళవారం 2 మే 2023

5

శ్రీకాకుళం



డిఎస్‌పిగా శృతి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

శ్రీకాకుళం డిఎస్‌పిగా వై.శృతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆత్మకూరు డిఎస్‌పిగా పనిచేస్తున్న ఈమెను ప్రభుత్వం గత నెల 25న శ్రీకాకుళానికి బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఇక్కడ డిఎస్‌పిగా పనిచేసిన మహేంద్ర స్థానంలో ఆమె నియమితులయ్యారు. నూతన డిఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన ఆమెకు సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్ఐలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న శృతి

ఉత్సాహంగా మే డే ఉత్సవం

ఆకట్టుకున్న కోలాటం

శ్రీకాకుళం నగరంలో చేపట్టిన ప్రదర్శలో మహిళల కోలాటం అందరినీ ఆకర్షించింది. ప్రదర్శన ముందుభాగంలో మహిళలు కోలాటం, కర్రసాము, డప్పు కళాకారులు ప్రదర్శించిన వాటిని దారి పొడవునా ప్రజలు తిలకించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ కిశోర్‌కుమార్, నాయకులు గొంటి గిరిధర్, ఐద్వా నాయకులు శ్రీదేవి పాణిగ్రహి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు కె శ్రీనివాసు, భవిరి కృష్ణమూర్తి, పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

- వాడవాడలా రెపరెపలాడిన అరుణ పతాకం
- ర్యాలీలు, పతాకావిష్కరణలతో హోరెత్తిన సిక్కోలు
- ఘనంగా కార్మిక దినోత్సవం



కొత్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు



శ్రీకాకుళం నగరంలో సిఐటియు ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి / యంత్రాంగం

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లావ్యాప్తంగా అరుణపతాకం రెపరెపలాడింది. పైడిభీమవరం, రణస్థలం, ఎచ్చెర్ల, పలాస పారిశ్రామికవాడలతో పాటు జిల్లాలోని అన్ని మండలాల్లో ర్యాలీలు, పతాకావిష్కరణలు చేపట్టారు. సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, టిఎన్‌టియుసి వాటి అనుబంధ సంఘాలు, పారిశ్రామికరంగ కార్మికులు, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశా కార్యకర్తలు, రైస్, జీడి, వ్యవసాయ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, బిఎస్ఎన్ఎల్, హమాలీలు మే డే ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీకాకుళం నగరంలో సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక డైమండ్ పార్కు నుంచి జిటి రోడ్డు మీదుగా ఏడురోడ్ల కూడలి, అక్కడ నుంచి పాలకొండ రోడ్డు మీదుగా బాపూజీ కళామందిర్ వరకు ర్యాలీ సాగింది. మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ర్యాలీ సమయంలో జోరుగా కురుస్తున్న వానలోనూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో నిర్వహించిన బహిరంగ సభలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, పట్టణ కన్వీనర్ కె.సూరయ్య మాట్లాడుతూ మేడే స్ఫూర్తితో బిజెపి అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వం ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలు తీవ్రంగా అమలు చేస్తూ మరోవైపు కార్మికుల హక్కులపై దాడి చేస్తున్నాయని చెప్పారు. సమ్మె చేసే హక్కు, యూనియన్ ఏర్పాటు, ఉమ్మడి బేరసారాలు, వేతనాలు, సామాజిక భద్రతల హక్కులు కుదించేశారని విమర్శించారు. పర్మినెంట్ ఉద్యోగాల స్థానంలో నిర్ణీత కాలవ్యవధి ఉద్యోగాలుగా పాలకులు మార్పు చేశారని చెప్పారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్స్ ద్వారా కార్మిక హక్కులపై దాడిని తీవ్రతరం చేసిందని దుయ్యబట్టారు. కార్మిక చట్టాల అమలుకు సంబంధించిన తనిఖీలు లేకుండా పోయాయని, యజమానుల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు

అమరుల స్ఫూర్తితో సమరశీల పోరాటాలు

మే డే అమరుల స్ఫూర్తితో మరిన్ని సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు పిలుపునిచ్చారు. స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో పతాకాన్ని సీనియర్ నాయకులు వి.జి.కె మూర్తి ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. కొన్ని జెండాలు రాష్ట్రం దాటితే, మరికొన్ని జెండాలు దేశం దాటితే కనిపించవు గానీ ఎర్రజెండా ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లో, అన్ని ఖండాల్లో కనిపిస్తుందన్నారు. సంపద సృష్టిస్తున్న శ్రమజీవ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులను కట్టు బానిసలను చేస్తోందని విమర్శించారు. కార్మిక చట్టాలను బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేసిందని విమర్శించారు.



సిపిఎం కార్యాలయంలో జెండాను ఎగుర వేస్తున్న వి.జి.కె మూర్తి

కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, జి.సింహాచలం, కె.అప్పారావు, ఎం.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాకుళం నగరంలోని చౌదరి సత్యనారాయణ కాలనీలో రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి తాండ్ర అరుణ పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జన సాహితీ జిల్లా కార్యదర్శి పి. మోహనరావు, సంఘ జిల్లా అధ్యక్షులు పి.పోలారావు తదితరులు పాల్గొన్నారు.
- న్యూ కాలనీలోని డైమండ్ పార్క్ వద్ద పతాకాన్ని భవన నిర్మాణ కార్మిక సంఘం నగర ప్రధాన కార్యదర్శి ఎం.హరనాథ్ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సంఘ నగర అధ్యక్షులు జి.భీమారావు జిల్లా గౌరవాధ్యక్షులు ఆదినారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.
- పొట్టి శ్రీరాములు మార్కెట్ వద్ద జట్టు కళాసీ కార్మికుల ఆధ్వర్యాన నిర్వహించిన వేడుకల్లో పతాకాన్ని ఎఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.స్రవంతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షణ్ముఖరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.
- కార్మిక శాఖ కార్యాలయంలో ఉప కమిషనర్ ఎస్.డి.వి ప్రసాద్ కార్మిక నాయకులకు, ఉత్తమ యాజమాన్యాలకు మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో సహాయ కార్మిక కమిషనర్ అజయ్ కార్తికేయ, సహాయ కార్మిక అధికారులు శైలేష్ కుమార్, ఆర్.వి.వి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.
- శ్రీకాకుళం రూరల్ మండలం నీలం జ్యూట్ మిల్లు గేటు వద్ద సిఐటియు జిల్లా కోశాధికారి ఎ.సత్యనారాయణ పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో నీలం జ్యూట్ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.నాగేశ్వరావు, ఎన్.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.
- రణస్థలం మండలంలో అరబిందో ఫార్మా, రెడ్డీస్ లేబొరేటరీస్, శ్యామ్‌పిస్టన్స్ ప్లాంట్-2, యునైటెడ్ బ్రేవరీస్, ఫ్రింజ్ లేబొరేటరీస్ పరిశ్రమ వద్ద, పైడిభీమవరం సిఐటియు కార్యాలయం వద్ద, రణస్థలం మండల కేంద్రంలో పతాకాలను సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వెలమల రమణ, పలు పరిశ్రమల కార్మిక సంఘాల నాయకులు కె.గురునాయుడు, బి.ఆదినారాయణ, ఎం.అప్పలనరసయ్య, ఐ.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. పైడిభీమవరంలోని రెడ్డీస్ లేబొరేటరీస్ వద్ద టిఎన్‌టియుసి సీనియర్ నాయకులు జె.వి.ఎన్ రాజు జెండాను ఎగురవేశారు.
- కాశీబుగ్గ పాతబస్టాండ్ వద్ద యుటిఎఫ్ నాయకులు బి.చిట్టిబాబు పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్.వి.రమణ, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, చాపర వేణుగోపాల్, భ్యాగ్యలక్ష్మి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. లేబర్ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వార్డు ప్రతినిధి అంబటి ఆనంద్, యుటిఎఫ్ నాయకులు ఎల్.వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు. కార్మిక సంఘాల ఆధ్వర్యాన నిర్వహించిన బైక్ ర్యాలీలో దువ్వాడ శ్రీకాంత్ పాల్గొన్నారు. టెక్కలిపట్నం రైతు భరోసా కేంద్రం వద్ద ఎఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు చాపర వెంకటరమణ పతాకాన్ని ఆవిష్కరించారు.
- కంచిలి సిఐటియు కార్యాలయం వద్ద రైస్ మిల్లు కార్మికుల సంఘం మండల కార్యదర్శి రఘు పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కంచి కామాక్షి కొబ్బరి కార్మిక యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.గోపీనాథ్, పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- సోంపేట మండలం బారువలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన సోంపేట కార్మికశాఖ సహాయ అధికారి పి.సూర్యనారాయణ పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పి.సురేష్, పి.చిరంజీవి పాల్గొన్నారు.
- టెక్కలి సిఐటియు కార్యాలయం వద్ద సిఐటియు జిల్లా నాయకులు నంబూరు షణ్ముఖరావు పతాకాన్ని ఆవిష్కరించారు. ముందుగా పాతబస్టాండ్ నుంచి సిఐటియు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు పి.ధర్మారావు, టెలికాం యూనియన్ నాయకులు సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు. స్థానిక శ్రీకృష్ణ ఫంక్షన్ హాల్‌లో అసిస్టెంట్ లేబర్ అధికారి ఆర్.రాధాకుమారి అధ్యక్షతన నిర్వహించిన మేడే సభలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారి జి.ఎల్లారావు మాట్లాడారు.
- మెళియాపుట్టి మండలం చాపర సిఐటియు కార్యాలయం వద్ద పతాకాన్ని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పోలాకి ప్రసాదరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల ధ్యక్షులు దారపు దామోదరరావు, యుటిఎఫ్ నాయకులు మణిమాల, శంకర్ పాల్గొన్నారు.
- మందసలో సిఐటియు కార్యాలయం వద్ద సిఐటియు మండల అధ్యక్షులు పి.దేవేంద్ర పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కె.కేశవరావు, ఎం.ధర్మారావు, ఎస్.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. హరిపురంలో కొత్త కోనేరు నుంచి కార్మిక సంఘం భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిఐటియు నాయకులు ఎం.ఖగేశ్వరరావు జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎన్.హడ్డి, హరిపురం సర్పంచ్ పురుషోత్తం, ఎంపిటిసి అప్పన్న తదితరులు వెంకటరావు పాల్గొన్నారు.
- పోలాకి ప్రధాన మార్కెట్ ఆవరణలో పతాకాన్ని ఆశావర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.అమరావతి ఎగురవేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కరగాన కొండయ్య, వై.శైలజ తదితరులు పాల్గొన్నారు.
- నరసన్నపేట ఎంపిడిఒ కార్యాలయం వద్ద అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.జయలక్ష్మి పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సరోజినిభాగ్య, సులోచన, ఆర్.సురేష్‌బాబు, వై.చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.
- బూర్జ వడ్డివీధిలో సిఐటియు మండల నాయకులు ఈశరమ్మ జెండాను ఎగురవేశారు. కొల్లివలసలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు వి.ప్రసాద్ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గార హేమంత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి డి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
- ఆమదాలవలసలో వేర్ హౌసింగ్ గొడౌన్ వద్ద సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి జెండాను ఆవిష్కరించారు. అక్కడ్నుంచి మెయిన్ రోడ్డు మీదుగా రైల్వేస్టేషన్ కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్ధనరావు, పంచాది లతాదేవి, వేర్ హౌసింగ్ కళాసీల నాయకుడు రమణ తదితరులు పాల్గొన్నారు.
- వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవు, కాశీనగరం, గల్లీ, నగరంపల్లిలో పతాకాలను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో సిఐటియు మండల కన్వీనర్ నెయ్యల మోహనరావు, ఎస్.భైరాగి, డి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.
- ఎచ్చెర్ల మండలం పొన్నాడ స్మార్ట్‌కమ్ గేటు వద్ద స్మార్ట్‌కమ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఎన్.రమణమూర్తి పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎ.మహాలక్ష్మి, యూనియన్ అధ్యక్షులు పి.జనార్ధనరావు, ప్రధాన కార్యదర్శి పి.జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.
- గారలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ, ఆశా యూనియన్ నాయకులు సుజాత, రమణమ్మ, నీలవేణి తదితరులు పాల్గొన్నారు.
- జలుమూరులో పతాక ఆవిష్కరణలో రైతు సంఘం నాయకులు కె.కొండయ్య, కె.సింహాచలం, పి.మాలతి తదితరులు పాల్గొన్నారు.
- నందిగాం జెడ్‌పి ఉన్నత పాఠశాల వద్ద సిఐటియు నాయకులు పి.సాంబమూర్తి జెండాను ఎగురవేశారు.
- కోటబొమ్మాళిలో సిఐటియు టెక్కలి డివిజన్ కార్యదర్శి హనుమంతు ఈశ్వరరావు పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి సంత మార్కెట్‌లో సభ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి.సుధ, సనపల అనందరావు, ప్రజా సంఘాల సమన్వయ కమిటీ మండల కన్వీనర్ ఎస్.సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.
- పొందూరు మండలం శ్రీరాజ్యలక్ష్మి పోల్స్ పరిశ్రమ వద్ద సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు జెండాను ఎగురవేశారు. సింహాద్రి ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ గోడౌన్, పొందూరు వ్యవసాయ మార్కెట్ యార్డు కూడలిలో ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో రాజ్యలక్ష్మి పోల్స్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పేడాడ అప్పలనాయుడు, సింహాద్రి ఇండేన్ గ్యాస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రాధాకృష్ణ, బి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.
- కొత్తూరు ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్.గౌరమ్మ, నిమ్మక అప్పన్న తదితరులు పాల్గొన్నారు.



టెక్కలిలో ర్యాలీగా బయలుదేరుతున్న కార్మికులు



రణస్థలం రూరల్ : నినాదాలు చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

- ఎల్ఎన్‌పేట మండల కేంద్రంలో సిఐటియు మండల నాయకులు వి.కృష్ణ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి ఎ.సత్యనారాయణ, కె.వి హేమలత, పి.పావని, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.
- ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా పర్లాకిమిడిలోని సిపిఎం కార్యాలయం వద్ద జిల్లా కార్యదర్శి దొందపాని రౌతో పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ముచ్చి బంగారయ్య, మహిత మిషాల్, మోహన బ్లాక్ కమిటీ కార్యదర్శి గోకులదల బెహరా తదితరులు పాల్గొన్నారు. మోటార్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన బస్టాండ్ వద్ద జెండాను ఎగురవేశారు. బస్టాండ్ నుంచి ట్రాన్స్‌పోర్టు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సుప్రీంకోర్టు న్యాయవాది కొమర ఢిల్లీరావు, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి జయంత్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి కార్యాలయంలో...

ఎచ్చెర్ల మండలం కుశాలపురం ఇండస్ట్రియల్ ఏరియాలోని ప్రజాశక్తి శ్రీకాకుళం ఎడిషన్ కార్యాలయం వద్ద పతాకాన్ని సిఐటియు సీనియర్ నాయకులు కె.శ్రీనివాసులు పతాకాన్ని ఆవిష్కరించారు. కార్మిక దినోత్సవ విశిష్టతను వివరించారు. యాడ్స్ జిల్లా ఇన్‌ఛార్జి టి.బుజ్జిబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎడిషన్ మేనేజర్ పి.కామినాయుడు, సమన్వయ కమిటీ కన్వీనర్ ఎ.సోమశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు సీనియర్ నాయకులు శ్రీనివాసు

మండు వేసవిలో నిండు జల్లులు

- జిల్లాలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు
- వేసవి తాపం నుంచి ఊరట

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఉపరితల ద్రోణి ప్రభావంతో జిల్లాలో పలుచోట్ల సోమవారం మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలకు వర్షాలు ఊరటనిచ్చాయి. వారం రోజులుగా తీవ్ర ఉక్కపోత, ఎండ వేడిమితో అల్లాడిన జనం వర్షపుజల్లులు, చల్లని గాలులతో ఉపశమనం పొందారు. ఎచ్చెర్ల, ఆమదాలవలస ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఉదయం ఎనిమిది 8.30 గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలను పరిశీలిస్తే ఎచ్చెర్లలో అత్యధికంగా 83.25 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆమదాలవలస పట్టణంలోని మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్‌లో 76.5 మి.మీ. బాలుర ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 57.75 మి.మీ, శ్రీకాకుళం బలగలో 34 మి.మీ, రణస్థలం మండలం గరికిపాలెంలో 32 మి.మీ, లావేరులో 30 మి.మీ వర్షం కురిసింది. బూర్జ మండలం కొల్లివలసలో 27.5 మి.మీ, హిరమండలంలో 27 మి.మీ, శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ప్రాంతంలో 25.75 మి.మీ వర్షం పడింది. కొత్తూరులో అత్యల్పంగా 1 మి.మీ వర్షం కురిసింది.

ముంచెత్తిన మురుగు

జిల్లాలో పలుచోట్ల కురిసిన వానలకు కాలువల్లో మురుగు ముంచెత్తింది. శ్రీకాకుళం నగరంలోని పొట్టి శ్రీరాములు కూడలి, పాతబస్టాండ్ ప్రాంతాల్లో రోడ్లపైనే మురుగు ప్రవహించింది. ఆమదాలవలసలోని పలు వార్డుల్లో కాలువల నుంచి రోడ్లపైకి భారీ వర్షపు నీరు చేరింది. ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలోనూ మురుగు నీరు చేరింది. మురుగునీటిలోనే ప్రయాణికులు రాకపోకలు సాగిస్తూ ఇబ్బందులు పడ్డారు.



'స్పందన'కు గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు

శ్రీకాకుళం : స్పందన కార్యక్రమానికి గైర్హాజరైన జిల్లా అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వినతుల స్వీకరణ అనంతరం జెసి అధికారులతో మాట్లాడుతూ అర్జీదారులకు నాణ్యమైన సమాచారంతో సమాధానం అందించాలని సూచించారు. రీ ఓపెన్‌లో ఉన్న అర్జీల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యాన ల్యాప్‌టాప్‌లను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఉప కలెక్టర్ జి.జయదేవి, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, పలు శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌కే 'ఉపాధి'

- రూ.94 వేలు పక్కదారి
- సొంత ఖాతాలో నగదు జమ
- నౌపడ ఎఫ్ఎ ప్రసాద్‌రెడ్డి నిర్వాకం

ప్రజాశక్తి - నౌపడ

వలసల నివారణకు ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కొందరు ఉద్యోగులకు అదనపు ఆదాయ వనరుగా మారింది. ఉద్యోగులు, విదేశాల్లో ఉన్న వారి పేర్లతో జాబ్‌కార్డులను సృష్టించి బినామీ మస్టర్లతో తమ సొంత ఖాతాలో కొంతమంది ఎన్ఆర్ఇజిఎ సిబ్బంది డబ్బులు వేయించుకుంటున్నారు. సంతబొమ్మాళి మండలం నౌపడలో చోటుచేసుకున్న ఉపాధి అక్రమాలు ఇందుకు ఉదాహరణగా నిలిచాయి. నౌపడ ఫీల్డ్ అసిస్టెంట్ నీలాపు ప్రసాదరెడ్డిపై అవినీతికి పాల్పడుతున్నట్లు తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తన పేరున, భార్య లక్ష్మి పేరున (జాబ్ కార్డు నెంబర్ 020255) జాబ్ కార్డు ఉంది. ఈ జాబ్ కార్డుపై ఒక్కరోజూ ఉపాధి పని చేయకుండా తమ స్టేట్‌బ్యాంకు ఖాతాలో రూ.94 వేల వరకు జమ చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో ఫీల్డ్ అసిస్టెంట్ ప్రసాద్ రెడ్డి ఖాతాకు రూ.41,236 జమ అయినట్లు సమాచారం. టెక్కలి మండలం పోలవరం బిసి హాస్టల్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్న సిద్ధా ప్రమీల (జాబ్‌కార్డు నెంబర్ 010563) ఉపాధి పనికి ఏ రోజూ వెళ్లలేదు. ఆమె ఖాతాలో రూ.19,275 జమ అయ్యాయి. కె.లింగూడు పోస్టుమెన్‌గా పనిచేస్తున్న అంపలాం శ్రీనివాసరావు (జాబ్‌కార్డు నెంబర్ 020393) ఖాతాలో రూ.1169 జమ అయింది. కొంతమంది విదేశాల్లో ఉన్న వాళ్ళ, గ్రామంలో పలుకుబడి ఉన్న వాళ్ల పేర్లనూ పనులకు వెళ్లినట్లు చూపుతున్నట్లు సమాచారం. ఇలా బినామీ పేర్లతో మస్టర్లు వేసి డబ్బులు పంచుకుంటున్నారన్న ఆరోపణలు కూలీల నుంచి వెల్లువెత్తుతున్నాయి. ఉపాధి హామీ బిల్లులు పడితే కూలీల దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. జాబుకార్డుల కోసం రూ.300 చొప్పున వసూలు చేస్తున్నట్లు బాధితులు పి.మీనాక్షి, తులసి తదితరులు చెప్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతి వసూళ్ల పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం



ఉపాధి హామీ పనికి హాజరు కాని వారిని మస్టర్లలో నమోదు చేయకూడదు. ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఉపాధి వేతనం పొందడం నిబంధనలకు విరుద్ధం. వీటిపై విచారణ చేసి, వాస్తవాలను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- ఉమాసుందరి, ఎంపిడిఒ, సంతబొమ్మాళి

మూతపడిన స్టోన్ క్రషర్లు

ఉపాధి కోల్పోతున్న వేలాది మంది కార్మికులు

ప్రజాశక్తి- పొందూరు

రాయల్టీ, సీనరేజీ ఛార్జీల పెంపును నిరసిస్తూ స్టోన్ క్రషర్ల యాజమాన్యాలు సోమవారం నుంచి క్రషర్లను మూసివేశారు. గతంలో మైనింగ్ డిపార్ట్‌మెంట్ అన్నిరకాల ఛార్జీలు, పన్నులను వసూలు చేయగా, ఇటీవల ప్రభుత్వం ఆ బాధ్యతను విశ్వసముద్ర అనే సంస్థకు అప్పగించింది. క్యూబిక్ మీటరుకు రూ.212 రాయల్టీ కింద చెల్లించాలన్నది ప్రభుత్వ నిబంధనలు కాగా, అంతకుమించి చెల్లించాలని ఆ సంస్థ ఒత్తిడి చేస్తున్నట్లు క్రషనర్ల యాజమాన్యాలు ఆరోపణలు చేస్తున్నాయి. దీనివల్ల క్వారీ, స్టోన్ క్రషర్లపై ఆర్థికంగా భారం పడి నిర్వహణ కష్టతరమవుతోందని చెప్తున్నాయి. ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో చెల్లింపులు స్వీకరించడం పైనా అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. రాయి, చిప్స్ లోడుపై సుమారు రూ.రెండు వేలు పెంచాల్సి అమ్మాల్సి ఉంటుందని చెప్తున్నాయి. ఈ సమస్యతో క్రషర్లను సరిగ్గా నడపలేకపోతున్నామని, తప్పనిసరి పరిస్థితుల్లోనే మూసివేశామని చెప్తున్నారు. సమస్యను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ఈనెల 3న భోగాపురం వస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలవాలని క్రషర్స్ యాజమానులు భావిస్తున్నారు.

ఉపాధిని కోల్పోతున్న వేలాదిమంది కార్మికులు

జిల్లాలో టెక్కలి, శ్రీకాకుళం, ఆమదాలవలస, హిరమండలం, పొందూరు, మెళియాపుట్టి మండలాల పరిధిలో సుమారు వందకు పైగా స్టోన్ క్రషర్లు ఉండగా, ఒక్క పొందూరు మండలంలోనే సుమారు 20 వరకు ఉన్నాయి. ఈ క్రషర్ల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇప్పుడు వాటిని మూసివేయడంతో ఉపాధిని కోల్పోతున్నామంటూ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



రాపాక కూడలిలో నిలిచిపోయిన స్టోన్ క్రషర్ నిర్వహణ


పుష్పగుచ్ఛం అందజేస్తున్న న్యాయవాదులు

న్యాయమూర్తులు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం

శ్రీకాకుళం జిల్లా కోర్టులో మూడో అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు, 4వ అదనపు జిల్లా జడ్జి ఎస్.ఎం ఫణికుమార్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ సోమవారం న్యాయమూర్తులుగా బాధ్యతలు చేపట్టారు. వీరిని నూతనంగా ఏర్పాటైన జిల్లా బార్ అసోసియేషన్ కార్యవర్గ ప్రతినిధులు, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్ని సూర్యారావు ఆధ్వర్యాన ఆయా న్యాయమూర్తుల ఛాంబర్లలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసారు. వారికి పుష్పగుచ్ఛాలను అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పొన్నడ రాము, ఉపాధ్యక్షుడు గొంటి చంద్రమోహన్, సంయుక్త కార్యదర్శి నీలంశెట్టి చిన్నారావు, ట్రెజరర్ ఎల్.నారాయణ, కార్యదర్శి లైబ్రరీ ఎం.భవానీప్రసాద్, స్పోర్ట్స్, కల్చరల్ కార్యదర్శి భాస్కరరావు గంగుల, మహిళా కార్యదర్శి వి.హరిప్రియ, సీనియర్ న్యాయవాదులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ వాన కృష్ణచంద్, కొమరపు అఫీస్‌నాయుడు, శిష్టు రమేష్, కె.విశాలాక్షి, డి.సరళాదేవి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జోగారావు

వేసవి శిక్షణా శిబిరాలు ప్రారంభం

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపల్ పరిధిలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యాన వేసవి శిక్షణా శిబిరాలు సోమవారం ప్రారంభమయ్యాయి. పలాస మైదానంలో టెన్నికాయిట్, ఖోఖో, కాశీబుగ్గ రైల్వే ఇనిస్టిట్యూట్‌లో బ్యాడ్మింటన్ శిబిరాలు నెల రోజులు పాటు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ గుజ్జు జోగారావు, పలాస ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.తులసీరావు మాట్లాడుతూ వేసవిలో క్రీడలు నిర్వహించడం అవసరమన్నారు. కార్యక్రమంలో క్రీడా ప్రోత్సాహకులు మల్లా భద్రయ్య, బద్రి గోపాల్, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ ఎల్.శ్రీనివాసరావు, బ్యాడ్మింటన్ సంఘ ప్రతినిధులు మూల మల్లికార్జునరావు, చల్లా రమేష్, రైల్వే ఇనిస్టిట్యూట్ కార్యదర్శి జి.ఎల్.కె.రెడ్డి, శిక్షకులు పి.తవిటయ్య (టెన్ని కాయిట్), షేక్ మహమ్మద్ (బ్యాడ్మింటన్), వ్యాయామ విద్య ఉపాధ్యా యులు ఎస్.రామారావు, సిహెచ్.పద్మలోచనం, పి.గజేంద్ర, ఎస్.చంద్ర శేఖర్, జాతీయ క్రీడాకారులు కె.రామారావు, ఎం.దామోదర్ పాల్గొన్నారు.


పురస్కారాన్ని అందుకుంటున్న కృష్ణమూర్తి

'తెప్పల'కు జాతీయ సాహిత్య పురస్కారం

పలాస : తెలుగు వెలుగు జాతీయ సాహిత్య వేదిక, ఎస్‌వి ఫౌండేషన్ సంయుక్త నిర్వాహణలో హైదరాబాద్ పఠాన్ చెరువు జిహెచ్‌ఎంసి మల్టీ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన జాతీయ సాహిత్య సంబరాల్లో సీనియర్ రచయిత, నటుడు, జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి జాతీయ పురస్కారం లభించింది. తెలుగు బుక్ అఫ్ రికార్డ్స్ ధ్రువపత్రాల శతాధిక శతక కవి, తానా ప్రపంచ వేదిక సమన్వాయకర్త చిగురుమళ్ల శ్రీనివాసరావు, టి.బలరాం చౌదరి, సీనియర్ న్యాయవాది, జాతీయ ప్రధాన సలహాదారులు కిలపర్తి దాలినాయుడు కార్యవర్గ సభ్యులు చేతుల మీదుగా ప్రదానం చేశారు. కృష్ణమూర్తిని లయన్స్ క్లబ్స్ సభ్యులు జనజాగృతి సభ్యులు లలిత కళారంజని, తెరవే, ఉద్దానం సాహిత్య వేదిక సభ్యులు అభినందనలు తెలిపారు.

'కుప్పిలి'కి సుకవి విభూషణ బిరుదు


అవార్డును అందుకుంటున్న వెంకట రాజారావు

ఆమదాలవలస : తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువులో తెలుగు వెలుగు జాతీయ సాహిత్య సంబరాల్లో నిర్వహించిన కవితల పోటీల్లో పట్టణానికి చెందిన కవి కుప్పిలి వెంకట రాజారావు ప్రథమ బహుమతి గెలుపొందారు. ఈ సందర్భంగా ఆయనకు 'సుకవి విభూషణ' బిరుదును ప్రదానం చేశారు. ఆరు రాష్ట్రాల నుంచి 183 మంది కవులు పాల్గొన్నారు. అందులో రాజారావు రచించిన 'జింక బాణం సంధిస్తే' అనే కవితకు ప్రథమ బహుమతి లభించిందని తెలిపారు. 'సుకవి విభూషణ' బిరుదును తానా సమన్వయకర్త చిగురు మళ్లశ్రీనివాస్ చేతుల మీదుగా ఆదివారం అందించినట్లు తెలుగు వెలుగు ఫౌండేషన్ అధ్యక్షులు మూర్తి, కార్యదర్శి మోటూరి నారాయణరావు తెలిపారు. రాజారావుకు బిరుదు రావడంపై పట్టణానికి చెందిన పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

నిర్వహణ భారం.. కోళ్లఫారాలకు శాపం

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలో వ్యవసాయం అంతగా గిట్టుబాటు కాకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ మార్గాల వైపు దృష్టి సారించారు. ఇందులో భాగంగా కోళ్ల పారాలు ఏర్పాటు, ఇంటిగ్రేషన్ పద్ధతిలో ఏజెన్సీ ద్వారా కోళ్లను పెంచి ఉపాధి పొందేవారు. రణస్థలం, లావేరు మండలాల్లో కోళ్ల పెంపకం అత్యధికంగా ఉండేది. కొంత మంది రైతులు పారాలను ఏర్పాటు చేసి కోడి పిల్లలను పెంచేవారు. ఎక్కువ మంది ఇంటిగ్రేషన్ పద్ధతిలో ఏజెన్సీల ద్వారా పిల్లలను తీసుకొని పెంచినందుకు కిలోకు నిర్దేశిత నగదు తీసుకునేవారు. ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. రెండేళ్లుగా విద్యుత్ ఛార్జీలు, కోళ్ల దాణా ఖరీదు పెరగడం, ఖర్చుకు తగ్గ ఆదాయం లేకపోవడంతో రైతులు కోళ్ల ఫారాలను మూసేస్తున్నారు.

ఇంటిగ్రేషన్ పద్ధతిలో రైతులు షెడ్లు సిద్ధం చేస్తే... ఏజెన్సీలు కోడి పిల్లలను, వాటికి మేత, మందులు ఇచ్చి పెంచిన కోడికి కిలోకు కొంత డబ్బు చెల్లిస్తారు. 45 రోజులకు నాలుగు కిలోల మేత అందిస్తే కోడి 2,2 కేజీల బరువు పెరగాలి. అలా పెరిగితేనే కేజీకి రూ.6.80 పైసలు ఇస్తారు.


ఖాళీగా దర్శనమిస్తున్న కోళ్ల ఫారాలు

లేకుంటే పైకంలో కోత విధిస్తారు. దీంతో నిర్వాహకులు నష్టాల పాలవుతున్నారు.

ఏజెన్సీలు నాణ్యమైన మేత అందించకపోవడంతో నిర్దేశిత సమయంలో కోళ్ల బరువు పెరగకపోవడంతో రైతులకు అనుకున్నంత ధర వచ్చేది కాదు. విద్యుత్ బిల్లులు, కూలీల ఖర్చులు, పెట్రోలు, డీజిల్ ధరలు పెరగడంతో పెట్టుబడి తడిసి మోపెడవుతోంది. రణస్థలం, లావేరు మండలాల్లో గతేడాది వరకు 50 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కోళ్ల పారాలు ఉండేవి. ఈ ఏడాది అవి 30 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణానికి పడిపోయాయని రైతులే చెబుతున్నారు.

లీజుకి ఇచ్చేశాను

నేను పది వేల కోళ్లు పెంచే సామ ర్థ్యం గల షెడ్లును నిర్మించాను. 30 ఏళ్లుగా కోళ్ల పారం నిర్వహిస్తున్నాను. మేత, విద్యుత్ బిల్లులు, కూలీల ఖర్చులు, కూలీల కొరత, షెడ్ల నిర్వహణ ఖర్చులు పెరిగిపోయాయి. గతంలో రెండు నెలలకు రూ.4 వేల విద్యుత్ బిల్లు వస్తే... ఇప్పుడు నెలకే రూ.8 వేల నుంచి రూ.10 వేలు వస్తుంది. అందుకు నిర్వహణ ఖర్చు పోరగడంతో వేరే వ్యక్తికి లీజుకు ఇచ్చేశాను.

- అముజూరు శివాజీ, లంకపేట, కోళ్ల రైతు

ఖర్చులు పెరిగిపోయాయి

నేను 25 ఏళ్లుగా కోళ్ల ఫారాన్ని నిర్వహిస్తున్నాను. మొదట్లో 60 వేల పిల్లలను పెంచేవాడిని. ఇప్పుడు 30 వేల కోళ్లను మాత్రమే పెంచుతున్నాను. గతంలో 70 కేజీల దాణా రూ.200 ఉండేది. ప్రస్తుతం రూ.3,500 అయింది. మొక్కజొన్నతో కలిపిన మిశ్రమ మేత బస్తా రూ.2,700 ఉండేది. ప్రస్తుతం రూ.4 వేలు అయింది. నిర్వహణ భారం విపరీతంగా పెరిగిపోవడంతో ఏడాదిలోనే రూ.5 లక్షలు నష్టపోయాను.

- కుప్పిశెట్టి లక్ష్మణరావు, కోళ్ల రైతు, రణస్థలం

అలరించిన మేడే సాంస్కృతిక ఉత్సవాలు


నృత్య కళా ప్రదర్శన చేస్తున్న శ్రీకాంత్ బృందం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన నగరంలోని బాపూజీ కళా మందిరంలో రెండు రోజుల పాటు జరిగే సాంస్కృతిక ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. శ్రామికుల హక్కులు, దేశసమైక్యత, సమగ్రతల కోసం, ఐక్యంగా పోరాడేందుకు, ప్రతిజ్ఞ తీసుకునే దీక్షా దినం మేడే అని జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కె.నాగమణి అన్నారు. శ్రమలో నుంచి కళలు పుట్టుకొచ్చాయని, కళ ప్రజల కోసమేనని అన్నారు. శ్రామికుల్లో ఉండే కళాకారుల నైపుణ్యాలను వెలికిదీసే క్రమంలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రంతో కలిసి పనిచేస్తుందని గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎం.ప్రభాకరరావు అన్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు ప్రదర్శించిన కోలాటం, రఘుపాత్రుని శ్రీకాంత్ ఆధ్వర్యాన నృత్య కళా ప్రదర్శన, గాయత్రి స్వరాంజలి ఆర్కెస్ట్రా భక్తి గీతాలు, గురుమూర్తి ప్రదర్శించిన అల్లూరి సీతారామరాజు ఏకాపాత్రాభినయం, ప్రముఖ రచయిత కంచరాన భుజంగరావు కార్మిక సంక్షేమ కవిత ఆహుతులను ఆకట్టుకున్నాయి. మంగళవారం కార్యక్రమాలు బాపూజీ కళామందిర్ నుంచి అంబేద్కర్ ఆడిటోరియానికి మార్పు చేశామని నిర్వాహకులు తెలిపారు.


గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

జె.ఆర్ పురం-2 సచివాలయం ప్రారంభం


సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ప్రజాశక్తి- రణస్థలం

గ్రామాభివృద్ధికి సిఎం జగన్మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. ఉపాధి హామీ నిధులు రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన జె.ఆర్.పురం-2 నూతన గ్రామ సచివాలయాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.కోటి నిధులతో సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్ల నిర్మిస్తున్నామని అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యలను గుర్తించి రూ.40 లక్షలతో పంచాయతీ అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని అన్నారు. లోవోల్టేజ్ సమస్యను తీర్చేందుకు నాలుగు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామని అన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ ఛైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరాము నాయుడు, మండల వ్యవసాయ సలహా మండల ఛైర్మన్ పైడి శ్రీనివాసరావు, జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, ఎంపిడిఒ ధనుంజయరావు, తహశీల్దార్ సనపల కిరణ్, పంచా రాజ్ ఎఇ కూర్మనాథం, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ రామారావు పాల్గొన్నారు.

అరసవల్లి అభివృద్ధికి తోడ్పాటు

పాలక మండలి సమావేశంలో సభ్యులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ప్రాముఖ్యత ఉన్న అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తమ వంతు సహకారం అందిస్తామని పాలక మండలి సభ్యులు తెలిపారు. అరసవల్లిలోని సమావేశ మందిరంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన పాలక మండలి తొలి సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, ఉత్సవాల నిర్వహణ, యాత్రికులకు అందిస్తున్న సౌక్యాలను ఇఒ వి.హరిసూర్యప్రకాష్ సభ్యులకు వివరించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న ఇంద్రపుష్కరణి అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. వచ్చే సందర్శకులకు వసతి సౌకర్యాలు సమకూర్చాల్సి ఉందని సభ్యులు ప్రస్తావించారు. ప్రస్తుతం ఉన్న వసతి సౌకర్యాలు నామమాత్రంగా ఉండడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి


మాట్లాడుతున్న ఇఒ హరిసూర్యప్రకాష్

అసౌకర్యం కలుగుతోందని సభ్యులు తెలిపారు. అదనపు వసతులు సమకూర్చడానికి ఆలోచన చేయాలన్నారు. సమావేశంలో ప్రధాన అర్చకులు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ పాలక మండలి సభ్యులు మండవల్లి రవి, లుకలాపు గోవిందరావు, డాక్టరు కొంచాడ సోమేశ్వరరావు, నెమలపురి కోటేశ్వర చౌదరి, దుక్క గనిరాజు, జలగడుగుల శ్రీనివాస్, మైలపల్లి లక్ష్మి, సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


అడ్డుకుంటున్న పోలీసులు

'జగనాసురా' అడ్డగింత

ప్రజాశక్తి- కవిటి

ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాలం అశోక్ ఆధ్వర్యాన మండలంలోని రామయ్యపుట్టుగ నుంచి టిడిపి నాయకులు సోమవారం 'జగనాసురా' కార్యక్రమంలో నిర్వహించారు. ముందుగా రామయ్యపుట్టుగలో ర్యాలీగా బయలుదేరిన టిడిపి నాయకులను ప్రగడపుట్టుగ వద్ద ఎస్ఐ రాము అడ్డుకున్నారు. ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనానికి అనుమతులు లేవని, శాంతిభద్రలకు విఘాతం కలుగుతుందని ఎమ్మెల్యే అశోక్‌కు నచ్చజెప్పారు. అనంతరం టిడిపి నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేఖంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మణిచంద్ర ప్రకాష్, సీపాన వెంకటరమణ, బెందాలం రమేష్, బెందాలం విజయ్, లోళ్ల శ్రీను, కొర్రాయి వాసుదేవ్, పుల్లట సంతోష్, పుల్లట రాజు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐగా రమేష్


రమేష్, ఎస్ఐ

ఇచ్ఛాపురం : ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో అక్రమ రవాణాపై నిఘా పెడతానని ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐ వి.రమేష్ తెలిపారు. ఇటీవల రూరల్ ఎస్ఐ రామకృష్ణ సస్పెండ్ కావడంతో ఆయన స్థానంలో నూతన ఎస్ఐగా రమేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన శ్రీకాకుళం స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తూ... ఇక్కడకు బదిలీపై వచ్చారు. పోలీస్‌స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులు పరిశీలించారు.

బావిలో పడి వృద్ధుడు మృతి


నరసింహులు (ఫైల్)

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని హరిశ్చంద్రపురం పంచాయతీ సాలిపేటకు చెందిన దాసరి నర్సింహులు (61) ఆదివారం పొలంలోని నేల బావిలో పడి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు నర్సింహాలు ఆదివారం పొలం పనులు ముగించుకొని స్నానానికి బావి వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో కాళ్లు జారీ బావిలో పడి మృతి చెందాడు. చికటి పడినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పరిసరాల్లో వెతికారు. ఊరి బయట బావి వద్ద తన దుస్తులు ఉండటం గమనించి కోటబొమ్మాళి అగ్నిమాపక సిబ్బందికి తెలియజేశారు. సిబ్బంది వచ్చి బావిలో నీటిని బయటకు ఇంజిన్ల ద్వారా తీయించి మృతదేహాన్ని రాత్రి బయటకు తీశారు. ఈ మేరకు మృతుడు కుమారుడు తులసీరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ ఎస్.కె.మహ్మద్ అలీ కేసు నమోదు చేస్తున్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమితం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుని భార్య పదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఇద్దరికి జైలు శిక్ష

పొందూరు: మండలం లోలుగు కాలనీ సమీపంలో 2018 ఆగస్టు 1న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతికి కారణమైన ముద్దాయిలు ముని హరిసూర్య, లచ్చుబుక్త శంకరరావుకు జైలుశిక్ష విధిస్తూ సోమవారం రాజాం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సీనియర్ సివిల్ జడ్జి తీర్పునిచ్చినట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ట్రాక్టర్‌తో ఆటోను ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న మండలంలోని మలకాంకు చెందిన జాడ భాగ్యలక్ష్మి, కిల్లారి అనూరాధలు సంఘటన స్థలంలోనే మృతి చెందగా, పలువురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ ముని హరిసూర్యకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.6 వేలు జరిమానా, ట్రాక్టర్ యజమాని లచ్చుబుక్త శంకరరావుకు మూడు నెలల జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పును వెలువరించారు. దీనిపై అప్పటి ఎస్ఐ బాలరాజు కేసు నమోదు చేయగా, సిఐ వై.రామకృష్ణ విచారణ జరిపారు. ఈ కేసును బాధితుల తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారని తెలిపారు.


మృతదేహం వద్ద నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్, (ఇన్‌సెట్‌లో వరలహాలమ్మ (ఫైల్)

వైస్ ఎంపిపికి మాతృవియోగం

లావేరు : మండలంలోని పెద్దలింగలవలసకు చెందిన లావేరు మండల పరిషత్ ఉపాధ్యక్షులు లుకలాపు శ్రీనివాసరావు తల్లి వరహాలమ్మ (78) సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న విజయనగరం ఎంపీ బెల్లన చంద్రశేఖర్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ వరహాలమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, రణస్థలం, జి.సిగడాం, చీపురుపల్లి ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. వరహాలమ్మ భర్త కీర్తిశేషులు లుకలాపు జగ్గారావు పెద్దలింగలవలస సర్పంచ్‌గా సుదీర్ఘకాలం సేవలు అందించారు. ఆమె చిన్న కుమారుడు శ్రీనివాసరావు వైస్ ఎంపిపిగా కొనసాగుతున్నారు.


పాఠాలను బోధిస్తున్న రాంప్రసాద్

ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రత్యేక తరగతులను సోమవారం నుంచి నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు తెలిపారు. ఇంటర్మీడియట్ కమిషనర్ శేషగిరిబాబు ఆదేశాల మేఉకు డివిఇఒ కోట ప్రకాశరావు సూచన ప్రకారం తమ కళాశాలలో చదివి పరీక్షలో తప్పిపోయిన విద్యార్థులు, ఇంప్రూవ్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకున్నవారికి ఈ అవకాశం కల్పించామని తెలిపారు. ముగ్గురు అధ్యాపకులు ప్రత్యేక తరగతులు నిర్వహించగా... 20 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు.


గీతాన్ని ఆవిష్కరిస్తున్న ఓంకార్

ఎర్ర జెండాపై పాట ఆవిష్కరణ

పలాస : మేడే సందర్భంగా పలాసలో కలం గళం క్రియేషన్స్ ఎర్ర జెండాపై యుటిఎఫ్ నాయకులు బి.ఓంకార్ మాస్టార్ పాటను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రచయిత నగిరి కరుణాకర్, గాయకులు బి.దుర్యోధన మాస్టర్, బి.గోపాల్, గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు సిహెచ్.పద్మలోచన, పి.శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు ఎన్.గణపతి, దాసరి శ్రీనివాసరావు, నీలాపు ఉపేంద్ర, జి.భీమారావు, తివడాన శంకర్ పాల్గొన్నారు.

రత్తకన్న క్వారీ రోడ్డుకు మోక్షం

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురంలో పురపాలక సంఘంలో 18,19,20 వార్డుల్లో రత్తకన్న క్వారీ రోడ్డుకు మోక్షం లభించింది. ఈ రోడ్డు అధ్వానంగా ఉండడంతో రాకపోకాలకు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. దీనిపై వార్డు కౌన్సిలర్లు ఇటీవల నిర్వహించిన సమావేశంలో ప్రస్తావించారు. దీంతో మున్సిపల్ కమిషనర్ రమేష్ స్పందించి సోమవారం ప్రొక్లెయినర్‌తో మరమ్మతులు పనులు చేపట్టారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎఇ కామేష్, వార్డు ప్లానింగ్, శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు


వికలాంగురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

పార్టీలకతీతంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నామని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చీపుర్లపాడులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలందరూ సంతృప్తిగా ఉన్నారని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీనీ సిఎం అమలు చేస్తున్నారని అన్నారు. అనంతరం సమావేశ ప్రాంగణానికి వచ్చిన వృద్ధులతో, వికలాంగులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, మండల సచివాలయ కన్వీనర్ల ఇన్‌ఛార్జి గడ్డవలస నాగభూషణరావు, సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు, ఎంపిటిసి బొడ్డు అప్పన్న, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు నూక సత్యరాజు పాల్గొన్నారు.

'అరబిందో' ఆర్థికసాయం


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జి.సిగడాం మండలం సంతఉరిటికి చెందిన పడాల రూపాదేవి ఇటీవల ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో నిర్వహించిన 5వ జాతీయస్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని బంగారు పతకాలను సాధించారు. ఈ నెల 9న థాయిలాండ్‌లో నిర్వహిస్తున్న అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు రూపదేవి అవకాశం వచ్చింది. అయితే ఆ పోటీకి వెళ్లి పాల్గొనేందుకు, అక్కడ అయ్యే ఖర్చులు పెట్టుకునేందుకు ఆదుకోవాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లింది. ఎమ్మెల్యే అరబిందో ఫార్మా ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ నిత్యానందరెడ్డికు తెలియజేశారు. ఆయన స్పందించి అంతర్జాతీయ పోటీకు వెళ్లేందుకు, అడక్క అయ్యే ఖర్చుల నిమిత్తం రూ.3 లక్షల చెక్కును సోమవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు.

వరిసాంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి...

మండలంలోని పైడిభీమవరం పంచాయతీ వరిసాంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అరబిందో ఫార్మా ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ నిత్యానందరెడ్డి రూ.12 లక్షల చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా గ్రామ పెద్దలకు అందజేశారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ ఛైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, అరబిందో ఫార్మా కంపెనీ ప్రతినిధులు కె.కమలాకర్‌రెడ్డి, జి.సిగడాం మండలం ఎంపిపి ప్రతినిధి ఎం.వెంకటరమణ, జెడ్‌పిటిసి కాయల రమణ, జెసిఎస్ మండల ఇన్‌ఛార్జి డోల వెంకటరమణ, రణస్థలం వైస్ ఎంపిపి రాయపురెడ్డి బుజ్జి, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ పిల్ల ఆనంద్ పాత్రుడు, సంతఉరిటి సర్పంచ్ బుడారి లక్ష్మణ పాల్గొన్నారు.

శిక్షణను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఎపిఎం ప్రసాదరావు

ఇచ్ఛాపురం: మండల మహిళ సమైక్య గ్రామ సంఘ నాయకులు లోకస్ యాప్ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఎపిఎం ప్రసాదరావు సూచించారు. స్థానిక మహిళా సమాఖ్య భవనంలో సంఘ సభ్యులకు సోమవారం శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ శిక్షణలు నాలుగు రోజుల పాటు శిక్షణ ఉంటుందని అన్నారు. 2011 జూన్ 11 వరకు మాత్రమే భారత ప్రభుత్వం వద్ద మహిళా స్వయం శక్తి సభ్యుల సమాచారం ఉందని అన్నారు. ప్రస్తుతం ప్రతి మహిళా సంఘ సభ్యుల సమాచారం ఉండాలన్నారు. ఆధార్ కార్డు, వ్యక్తిగత బ్యాంకు అకౌంట్, సంఘం బ్యాంకు పాస్ పుస్తకం, మిగిలిన ధ్రువపత్రాలు ఈ-యాప్‌లో సంబంధిత విఒఎలు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. దీనిద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో సభ్యులకు అందడానికి సులభతరమవుతుందని అన్నారు. కార్యక్రమంలో సిసి రామకృష్ణ, మోహనరావు, కంప్యూటర్ ఆపరేటర్, అకౌంటెంట్ పాల్గొన్నారు.

క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సెట్‌శ్రీ సిఇఒ బి.వి ప్రసాదరావు అన్నారు. నిరంతరం సాధన చేయడం ద్వారా క్రీడల్లో రాణించవచ్చని చెప్పారు. శ్రీకాకుళం టౌన్‌హాల్ వేదికగా నెల రోజుల పాటు నిర్వహిస్తున్న తైక్వాండో, ఫెన్సింగ్ వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను మెప్మా పీడీ కిరణ్, పర్యాటక శాఖ అధికారి నారాయణరావు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి, తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి తైక్వాండో శ్రీను తదితరులతో కలిసి సోమవారం ప్రారంభించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్, జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ల ఆధ్వర్యాన ఈ శిబిరాలను శాప్ సౌజన్యంతో నిర్వహిస్తుండగా, వాటిని అధికారులు ప్రారంభించి క్రీడాకారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను తైక్వాండో, ఫెన్సింగ్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నిపుణులైన శిక్షకుల వద్ద మెలకువలను నేర్చుకుని రానున్న రోజుల్లో క్రీడా పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు విద్యార్థులకు క్రీడలు అవసరమన్నారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ అలవడుతుందని,మానసిక,శారీరక దారుఢ్యానికి కూడా అవి దోహదపడతాయన్నారు. మెప్మా పీడీ కిరణ్ మాట్లాడుతూ పిల్లలు చదువులోనే కాకుండా క్రీడల్లోనూ రాణించేలా తల్లితండ్రులు ప్రోత్సహించాలన్నారు. చిన్ననాటి నుంచే తమకు నచ్చిన క్రీడలో శిక్షణ పొందితే పోటీల్లో రాణిస్తారని తెలిపారు. క్రీడల కోటాలో ఉన్నత చదువులు, ఉద్యోగావకాశాలు పొందేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో తైక్వాండో శిక్షకులు తైక్వాండో గౌతమ్, నవీన్, లక్ష్మణ్, ఫెన్సింగ్ కోచ్ జోగిపాటి వంశీ, జూడో కోచ్ మణి, ఫెన్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు భవానీ, గురుగుబెల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పేదల సంక్షేమమే ధ్యేయం

మెళియాపుట్టి : పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని వెంకటాపురం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సోమవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిఎం జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

చిన్నారికి పింఛను పంపిణీ

మండలంలోని వసుంధరకు చెందిన పాలక శ్యామల సికిల్ సెల్ వ్యాధితో బాధపడుతున్న నాలుగేళ్ల చిన్నారికి నెలకు రూ.పది వేలు పింఛను మంజూరైంది. నూతన పింఛనును ఎమ్మెల్యే రెడ్డి శాంతి చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

పలాస: కాశీబుగ్గ న్యూ కాలనీ మమత తల్లీపిల్లల ఆస్పత్రిలో విశ్రాంత ఉద్యోగ సంఘం, లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన రాగోలు జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నెఫ్రాలజిస్టు డాక్టర్ రాకేష్, కార్డియాలజీ డాక్టర్ సాయి తేజ 54 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 24 మంది గుండె, 20 మంది కిడ్నీ వ్యాధులు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షులు ఎన్.అప్పారావు, సెక్రటరీ తమ్మినేన మాధవరావు, పాలవలస అప్పయ్య, హనుమంతు ఎండదొర, పైల సూర్యనారాయణ పాల్గొన్నారు.



కచేరి నిర్వహిస్తున్న కళాకారులు

అలరించిన సంగీత కచేరి

కవిటి: స్థానిక పట్టాభిరామయ్య కళాపీఠం ఆధ్వర్యాన వైశాఖ మాస సంగీత ఉత్సవాలు సోమవారం వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన సంగీత కచేరి ఆహుతులను అలరించింది. కార్యక్రమంలో బంకుపల్లి విద్యాసాగర్ గాత్రానికి దుంపల ఈశ్వరరావు వయోలిన్, పండి తిరుపతిరావు మృదంగం, బంకుపల్లి శ్రీనివాస శర్మ ఘటం, అట్టాడ కవి కంజిర, ఆరింగి వెంకటరావు మార్సింగ్ తోడవడంతో కచేరి నభూతో నభవిష్యత్ అనేలా సాగింది.



నగదును అందిస్తున్న సభ్యులు

మరుగుదొడ్డి తప్పనిసరి

కవిటి: ప్రస్తుత రోజుల్లో ఇంటింటికీ మరుగుదొడ్డి తప్పనిసరని జైహింద్ ఫౌండేషన్ సభ్యులు అన్నారు. మండలంలోని సిలగాంకు చెందిన పాపారావు అంగవైకల్యంతో బాధపడుతున్న తాను మూత్రవిసర్జన సమయంలో చాలా సమస్యలు ఎదుర్కొంటున్నానని, మరుగుదొడ్డి నిర్మాణానికి సహకరించాలని జైహింద్ ఫౌండేషన్‌ను సంప్రదించాడు. దీంతో సోమవారం గ్రామానికి చేరుకున్న జైహింద్ ఫౌండేషన్ సభ్యులు మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.ఏడు వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదిరెడ్డి కుటుంబంపై కక్షసాధింపు తగదు



నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన టిడిపి నాయకులు ఆదిరెడ్డి అప్పారావు, అతని కుమారుడు వాసు ఇంటిపై దాడులు చేయడం ఉద్దేశపూర్వంగా వైసిపి ప్రభుత్వం కక్ష సాధింపు దోరణి అవలంబించడం తగదని తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కొర్ను నాగార్జున ప్రతాప్, జిల్లా అధ్యక్షులు మెండ దాసునాయుడులు అన్నారు. జిల్లా టిడిపి కార్యాలయంలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద తెలుగు యువత ఆధ్వర్యాన సోమవారం ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. అప్పారావు, వాసు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని ఇంటిపై దాడి హేయమైన చర్య అని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో భవానీని ఓటింగ్‌కు రానీయకుండా అడ్డుకునేందుకు చేసిన ప్రయత్నంలో వైసిపి నాయకులు విఫలమయ్యారని, టిడిపి అభ్యర్థిని గెలిపించుకున్న తర్వాత ఉద్దేశపూర్వకంగా వేధించడం మొదలు పెట్టారని అన్నారు. ఎన్‌టిఆర్ శతజయత్యుత్సవ వేడుకల్లో భాగస్వాములు కాకుండా చేయాలనే దురుద్దేశంతో ఇప్పుడు దాడులు చేయిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి బలగ చెంగల్‌రావు. దుంగ భాస్కర్, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షులు మెట్ట సుజాత, తెలుగు యువత సభ్యులు రోణంకి కళ్యాణ్, నగర తెలుగు యువత అధ్యక్షులు బుక్క యుగంధర్, వాళ్ల కిరణ్ పాల్గొన్నారు.

నవధాన్యాలతో భూసారం పెంపు



కిట్లను అందజేస్తున్న సాయికృష్ణ

ప్రజాశక్తి- పలాస

రైతులు నవధాన్యాలు వేసి భూసారం పెంచుకోవాలని ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ అన్నారు. మండలంలోని టెక్కలిపట్నం యూనిట్‌లో మోదుగులపుట్టిలో ప్రకృతి వ్యవసాయ కెపి 2023-24లో భాగంగా పిఎండిఎస్ కిట్లను సోమవారం పంపిణీ చేశారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రసాయనిక వ్యవసాయంతో భూమికి నష్టం కలుగుతుందన్నారు. తద్వారా మానవ జీవనావళికి మనుగడ కోల్పోతామని వివరించారు. పిఎండిఎస్ వేసుకోవడంతో భూమిలో సేంద్రీయ కర్బన శాతం పెరుగుతుందని, తద్వారా భూమి సారవంతం అవుతుందని చెప్పారు. పశువులకు మేతగా ఉపయోగపడుతుందని, కలుపు నివారణగా ఉపయోగపడుతుందని వివరించారు. ప్రతి రైతూ సీజన్‌లో ఎక్కువ మొత్తంలో ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. అందుకు ఖరీఫ్ సీజన్ నిర్వహిస్తూ గ్రామ గ్రామాన ప్రతి రైతూ తమ పేర్లను ప్రకృతి వ్యవసాయానికి నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఎస్‌డిఎ నాగరాజు, సనత్‌కుమార్, కె.పాపారావు, ఎ. షణ్ముఖరావు, యు.నారాయణరావు, ఐ.కూర్మరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం

ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

గ్రామీణ ప్రాంతాల్లో రైతులు తమ భూములు చౌడుబారకుండా, ఆరోగ్యంగా ఉండేందుకు మహిళా సంఘాల ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నట్లు వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మండలంలోని కొత్తవలసలో గ్రామ సంఘం మహిళలతో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నవధాన్యాల సాగు - నేల తల్లికి బాగు అన్న నినాదంతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అతిగా ఎరువులు, క్రిమిసంహారక మందులు ఉపయోగించరాదన్నారు. పాత పద్ధతిలో పెంటగత్తం, పశువుల పేడ, వర్మీకంపోస్టు ఎరువులను



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

వినియోగించాలన్నారు. నేలకు సారవంతమైన పద్ధతుల్లో కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ విధానం ద్వారా, నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, చిరుధాన్యాల సాగు పద్ధతుల నవలంబిస్తూ అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో విఒఎ గురుగుబెల్లి భారతి, క్లస్టర్ కో-ఆర్డినేటర్స్ రమణ, చందర్రావు, రామప్పుడు, ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ నక్క చిరంజీవి పాల్గొన్నారు.

అభివృద్ధికి వారధి యువజన సంఘం

వజ్రపుకొత్తూరు: అభివృద్ధికి వారధిగా యువజన సంఘాలు నిలవాలని గరుడభద్ర సర్పంచ్ ప్రతినిధి గూడ ఈశ్వరరావు అన్నారు. గరుడభద్ర షైనింగ్ స్టార్ యువజన సంఘం వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. యువజన సంఘం పతాకాన్ని సంఘ ఉపాధ్యక్షుడు చిత్రాడ మహేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లెలు అభివృద్ధిలో యువజన సంఘాలు భాగస్వాములు కావాలన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా గ్రామాభివృద్ధికి పాటుపడుతున్న షైనింగ్ స్టార్ యువజన సంఘాన్ని ప్రజలు చిరస్థాయిగా గుర్తు పెట్టుకుంటారని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి జి.నగేష్, వై.జోగారావు, పి.భీమారావు, వై.మన్మథ, గ్రామ సంఘ అధ్యక్షుడు వై.ధర్మారావు, కె.మోహనరావు, ఆనందరావు, ఎ.సోమేశ్వరరావు పాల్గొన్నారు.



అన్నదానం

ప్రజాశక్తి - ఆమదాలవలస

పట్టణంలోని మోనింగివారి వీధిలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయ ఆరో వార్షికోత్సవ సందర్భంగా రెండు వేల మందికి అన్నదానం చేశామని ఆలయ నిర్వహణ కమిటీ సభ్యుడు తమ్మినేని విద్యాసాగర్ తెలిపారు. వైశాఖ మాసం శుద్ధ ఏకాదశి సందర్భంగా అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం వేకువ జాము నుండే అభిషేకాలు నిర్వహించారు. పూజారిపేటకు చెందిన నేతాజీ యూత్ అసోసియేషన్ సభ్యుడు చిగురుపల్లి వెంకటేష్ మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి

ప్రజలను మోసం చేస్తున్న సిఎం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలోని ప్రజలు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేతిలో దారుణంగా మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ఆరోపించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో 10 తలల రావణాసురుడు జగన్ అంటూ ముద్రించిన పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ ఎన్నికలకు ముందు చెప్పిన మాయమాటలను నమ్మిన ప్రజలు ఆయనకు ఒక్క అవకాశమిచ్చారని అన్నారు. జగన్ పాలనలో అరాచకాలు, కూల్చివేతలు తప్ప అభివృద్ధి జాడే లేకుండాపోయిందన్నారు. సిబిఐ కేసుల నుంచి తప్పించుకునేందుకే ఢిల్లీ పర్యటనలు చేస్తున్నారే తప్ప రాష్ట్రాభివృద్ధి ఆయనకు పట్టడంలేదన్నారు. కార్యక్రమంలో నగర టిడిపి అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె.బాబు, తోనంగి వెంకన్నయాదవ్, తెలుగు యువత నగర అధ్యక్షుడు వాళ్ల కిరణ్, మల్ల నర్సింగరావు, పట్నాల పార్వతీశం, గండేపల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాబూరావు

రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం

పలాస: వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ భాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు అన్నారు. జగనాసుర అవినీతి అనే రాక్షసుడు కార్డును చించి సోమవారం నిరసన వ్యక్తం చేశారు అనంతరం టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైసిపి పాలన రాష్ట్రంలో అధ్వానంగా ఉందని ఆరోపించారు. మినీ మహానాడు రాజమండ్రిలో పెడుతున్నారని అక్కతో ఆదిరెడ్డి భవాని భర్తతో పాటు టిడిపి నాయకులను అరెస్టులు చేయడాన్ని ఈ సందర్భంగా ఖండిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో అవినీతికి హద్దులు లేకుండాపోయ్యిందని ఆరోపించారు. సాధారణ టీ షాపుల్లో డిజిటల్ విధానం ద్వారా నగదు బదిలీ చేస్తుంటే... రూ.కోట్లు కుమ్మరించే లిక్కరు షాపుల్లో ఎందుకు వాటిని ప్రవేశపెట్టలేదని ప్రశ్నించారు. ఈ నాలుగేళ్లలో ఒక్క ప్రాజెక్టు అయినా పూర్తి చేశారా? అని ప్రశ్నించారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు రవిశంకరుప్త, గురిటి సూర్యనారాయణ, హనుమంతు మురళీమోహన్, జోగ మల్లి, పైల చక్రధర్ పాల్గొన్నారు.



భోజనాన్ని అందజేస్తున్న కొంక్యాన సోదరులు

అనాథలకు భోజనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అనాథులను, వృద్ధులను, వికలాంగుల ను ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని వాకర్ ఇంటర్నేషనల్ 102 డిప్యూటీ గవర్నర్, కొంక్యాన గోవిందరాజులు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కొంక్యాన మురళీధర్ అన్నారు. కొంక్యాన రాజేశ్వరి ద్వితీయ వర్ధంతి సందర్భంగా నగరంలోని మదర్ థెరిసా హోంలో ఉన్న వృద్ధులకు, వికలాంగులకు సోమవారం రెండు పూటలా భోజన వితరణ చేపట్టారు. మదర్ థెరిసా హోంకు అవసరమైన ఇన్వర్టర్ బ్యాటరీ తన తండ్రి కొంక్యాన గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్టు తరపున అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు కోట సావిత్రమ్మ, కొన్న నరసింహమూర్తి, కొంక్యాన రాధాకృష్ణ, కొంక్యాన వేణుగోపాల్, మంగమ్మ, సరోజ, చైతన్య, ఫాల్గుణరావు, శివశంకర్ పాల్గొన్నారు.